విశాలాంధ్ర

పంటల సమాచారాన్ని సమగ్రంగా నమోదు చేయాలి

విశాలాంధ్ర-పర్చూరు: పంటల సమాచారాన్ని సమగ్రంగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ సత్తార్ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం పర్చూరు సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, యద్దనపూడి, ఇంకొల్లు, కారంచేడు మండలాల్లోని వీఏఏలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. డీఏఓ మాట్లాడుతూ రైతుల వివరాలు సమగ్రం నమోదు చేయాలని, ఈకేవైసీనీ పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంట నమోదు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త వరప్రసాద్, ఏడీఏ నాగభైరు మోహనరావు, మండల వ్యవసాయ అధికారులు ఆదినారాయణ, శివనాగప్రసాద్, మోహనరెడ్డి, వేణుగోపాల్, వీఏఏలు, ఏఈఓలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ప్రకాశం, బాపట్ల జిల్లాలు

జగనన్న గృహాల లేఅవుట్ల పరిశీలన

లే అవుట్‌లలో ఉన్న సమస్యలను తెలుసుకుంటున్న దృశ్యం

విశాలాంధ్ర-తాళ్లూరు : మండలంలోని సచివాలయం-2 పరిధిలోని జగనన్న గృహాలకు సంబంధించిన లే అవుట్లను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి ఉపేంద్రకుమార్, ఎంపీడీవో కె యుగ కీర్తి ఇతర అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న గృహాలు వేగవంతం కావడానికి ఏర్పడిన సమస్యలపై వారు ఆరా తీశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న గృహాల లే అవుట్ల పరిధిలో విద్యుత్ సౌకర్యం, నీటి సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలని ఆయన ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ఏఈ మనోహర్, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఏపీఎం నవీన్, ఏపీవో మురళి, ఈసీ ప్రసాదు, గ్రామ కార్యదర్శి చిరంజీవి, గ్రామ రెవెన్యూ అధికారి చంద్రశేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెలేఫేర్ అసిస్టెంట్, లబ్ధిదారులు, ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

యంత్రాల సాయంతో సాగు పనులు సులభం

యంత్ర పరికరం పనిచేసే విధానాన్ని చూపుతున్న ఏవో

విశాలాంధ్ర-తాళ్లూరు : యంత్రాల సహాయంతో సాగు పనులు చేసినట్లయితే వ్యవసాయం సులభతరం అవుతుందని మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్ రావు అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులో క్షేత్ర పర్యటన సందర్భంగా శుక్రవారం ఆయన ఫర్టిలైజర్ డిస్ట్రిబ్యూటర్ పరికరం ద్వారా పొలంలో ఎరువులు వెదజల్లే విషయంపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ముమ్మరమైన వ్యవసాయ పనుల సమయంలో కూలీల కొరత వల్ల ఇబ్బందులను తొలగించడానికి యంత్ర పరికరాలను ఉపయోగించడం ఉత్తమమని ఆయన తెలిపారు. రైతులు స్థానికంగా వెల్డింగ్ షాపుల వద్ద ఫెర్టిలైజర్ డిస్ట్రిబ్యూటర్ పరికరాన్ని తమకు అనుకూలంగా తయారు చేయించుకోవచ్చని, దీనిని వాడడం కూడా సులభమని ఆయన తెలిపారు. ఈ పరికరం ద్వారా ఇద్దరు, ముగ్గురు మనుషుల సహాయంతో 100 నుండి 150 బస్తాల ఎరువులు పొలంలో వెదజల్ల వచ్చని ఆయన తెలిపారు .రైతులు శాస్త్రీయ పద్ధతులతో ఆలోచించి యంత్ర పరికరాల ద్వారా సాగు చేయడం మంచిదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా దర్శకుడు అనిల్ రావిపూడి జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న తల్లిదండ్రులు అభిమానులు

విశాలాంధ్ర-యద్దనపూడి : ప్రముఖ సినీ దర్శకులు అనిల్ రావిపూడి జన్మదిన వేడుకలను స్వగ్రామైన చిలుకూరివారిపాలెంలో తల్లిదండ్రులు అభిమానులు ఘనంగా నిర్వహించారు. అభిమానులు గ్రామస్తులు కలిసి వారి తల్లిదండ్రుల సమక్షంలో కేక్ కట్ చేశారు. పటాస్, ఎఫ్2, ఎఫ్3లు ఆయనకు మంచి గుర్తింపు రాగ ప్రముఖ హీరో నందమూరి బాలకృష్ణతో త్వరలో కొత్త మూవీ శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. తక్కువ వ్యవధిలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు గ్రామానికి కూడా మంచి గుర్తింపు తెచ్చారని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు అనంతలక్ష్మి రావిపూడి బ్రహ్మయ్య కే జీవన్ బాబు కరణం శ్రీనివాసరావు, క ృపారావు, రంగా, శ్రీకాంత్, పద్మారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పరిశీలన

రుద్రసముద్రంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వసంతరావునాయక్

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలోని బాదాపురం, రుద్ర సముద్రం గ్రామాల్లోని జగనన్న కాలనీలను ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్ శుక్రవారం పరిశీలించారు. నిర్మాణం పూర్తి అయినవి, జరుగుతున్నవి పరిశీలించి డిశంబరు 25 నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా పనులు వేగవంతం చేయించాలని సిబ్బందికి సూచించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పునాదులు నిర్మించుకునేందుకు బ్యాంకు ద్వారా రుణాలు కల్పిస్తామని, అవసరమైన వారు వెంటనే రుణం పొంది నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన వారికి బిల్లులు చెల్లించాలని సిబ్బందిని ఆదేశించారు. ఫ్రై డే - డ్రై డేలో భాగంగా సిబ్బంది చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నదేవానంద్, ఏపీఓ తగరం దేవయ్య, ఎంపీటీసీ ఆదిసుబ్బారావు, కార్యదర్శి పి.క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

జంకెను అభినందించిన పెద్దదోర్నాల వైసీపీ మండల కన్వీనర్ గంటా



జంకె వెంకటరెడ్డికి అభినందనలు తెలుపుతున్న పెద్ద దోర్నాల మండల నాయకులు

విశాలాంధ్ర- పెద్దదోర్నాల : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడుగా నియమి తులైన మార్కాపురం మాజీ శాసనసభ్యుడు జంకె వెంకటరెడ్డిని శుక్రవారం మార్కాపురంలో ఆయన నివాస గృహంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దదోర్నాల మండల కన్వీనర్ ఘంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైకాపా నేతలు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైకాపా నేతలు ఘంటా గురువారెడ్డి, వెన్నా పాండురంగారెడ్డి, చల్లా వెంకటరెడ్డి, పలువురు నాయకులు కలిశారు.

గుండ్లకమ్మ.. ఓటికుండ

- గేటు విరగడంతో అడుగంటిన జలాశయం
- 1.5 టీఎంసీల వద్దే పరిమితమైన నిల్వ
- మిర్చి సాగుచేసిన రైతుల్లో ఆందోళన
- సాగర్ జలాలే ప్రత్యామ్నాయం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినప్పటికీ, గుండ్లకమ్మ జలశయంలో ఓటి మోతలు వినిపిస్తున్నాయి. రెండు నెలల క్రితం జలాశయం గేటు విరగడంతో జలాశయం నీరు ఖాళీ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ ప్రభావం కాలువల పరిధిలో సాగైన మిర్చి, ఇతర పంటలపై తీవ్రంగా పడనుంది. గుండమ్మ గేటు విరగడం, మరో రెండు గేట్లు పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో ప్రాజెక్టులో ఈ ఏడాది నీటిని నిల్వచేయలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం కేవలం 1.5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. దీనిలో డెడ్ స్టోరేజ్ 1.3 టీఎంసీలుగా ఉంది. ఇక ఈ క్రమంలో గేటు నుంచి ఉన్న నీరు కూడా లీకవుతోంది. దీంతో ఈ ఏడాది కాలువలకు నీటి విడుదలపై స్పష్టత లేకుండా ఉంది.

విస్తారంగా సాగైన మిరప :

ఈ ఏడాది కాలువల పరిధిలో మిరప విస్తారంగానే సాగైంది. ఏటా 15 వేల ఎకరాల్లో మిరప సాగువుతుండగా ప్రస్తుతం 10 వేల ఎకరాల్లో మిరప సాగైంది. గత నాలుగైదేళ్ల సగటుతో పోల్చుకుంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో పరిధిని మించి సాగైనట్టేలెక్క. మిరపకు సరిపడా సాగునీరు అందించాలంటే కనీసం ఒక టీఎంసీ నీటి వినియోగం అవసరం ఉంది. ఇక దీనితోపాటు వరిసాగుకు అదనంగా మరో టీఎంసీ నీరు గుండ్లకమ్మ పరిధిలో సాగైన భూమికి నీరు అవసరం. అయితే ప్రస్తుతం జలాశయంలో అంతమొత్తంలో నీరు లేదు. కేవలం డెడ్ స్టోరేజ్ వరకు మాత్రమే నీరు ఉంది. ఈ పరిస్థితిలో ఇకపై కాలువల నుంచి నీరు రావడంపై స్పష్టత కరువైంది. కనీసం మార్చి నెల ఆఖరు వరకైనా నీటిని ఇస్తేనే ఇప్పటికే సాగైన పంటలు చేతికొచ్చే అవకాశం ఉంది. ఆ ఆమేరకు నీటి ఈ ఏడాది సాగర్ నుంచైనా తీసుకొంటేనే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. సాగర్ నీరు అందకపోతే గుండ్లకమ్మ పరిధిలో పంటలు సాగుచేసిన రైతులకు తిప్పలు తప్పవు. గతంలో గుండ్లకమ్మను సందర్శించిన సమయంలో ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు ఇచ్చిన హామీ మేరకు సాగర్ నుంచి నీరు వస్తుందా..? లేదా..? అన్నదానిపై ఈ ఏడాది రైతులు భవితవ్యం ఆధారపడి ఉంది.

మెరుగైన వైద్య సేవలందించాలి

వైద్య సిబ్బందికి కలెక్టర్ సూచన

వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్న కలెక్టర్

విశాలాంధ్ర-తాళ్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యత నిస్తుందని ఈ క్రమంలో వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న తీరును ఆరా తీశారు. సిబ్బంది విభాగాల వారీగా విధులు నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎంలు ఆశ వాలంటీర్లు క్షేత్రస్థాయిలో విధులు సక్రమంగా నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వారి పనితీరును పరిశీలించే పై స్థాయి అధికారులు ఒక చార్టర్ ఏర్పాటు చేసుకుని దాని ప్రకారం విధులు నిర్వహించాలని కోరారు. బాధ్యతలు నిర్వహించే విషయంలో నిర్లక్ష్యం వహించినట్లయితే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రాథమిక వైద్యశాలకు ఎక్సే యంత్రాన్ని, రాత్రి విధులు నిర్వహించే సిబ్బంది నివాసానికి ఒక క్వార్టర్సు ఏర్పాటు చేయాలని ప్రాథమిక వైద్యశాల మాజీ అభివృద్ధి కమిటీ చైర్మన్ పల్లెబోయిన వెంకటేశ్వర్లు కోరారు. వాటిని పరిశీలిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె యుగ కీర్తి, తహసిల్దార్ ఎస్ రామ్మోహన్ రావు, వైద్యాధికారులు డాక్టర్ బి రత్నం, డాక్టర్ మృదుల, వీఆర్వో రాఘవరెడ్డి, వైద్య సిబ్బంది, సహాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర-అద్దంకి : పట్టణంలోని కాకానిపాలెంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం పునర్‌నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు సూచించారు. రూ 3,60కోట్ల టిటిడి నిధులతో నిర్మాణం జరుగుతున్న దేవస్థానం రాతికట్టడం పనులకు శుక్రవారం కృష్ణచైతన్య భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం పునర్‌నిర్మాణ కమిటి అధ్యక్షులు కాకాని రాధాకృష్ణమూర్తి, ఈవో కోటిరెడ్డి ,వైసీపీ నాయకులు సందిరెడ్డి రమేష్, వార్డు కౌన్సిలర్ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు

అధికారులను ప్రశ్నిస్తున్న మాజీ ఎంపీపీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : సమస్యల పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం వహిస్తున్నారని చిన్న సమస్యలను కూడా సచివాలయ సిబ్బంది కిందిస్థాయి అధికారులు చేత పనిచేయించుకోలేకపోతున్నారని, రేషన్‌కార్డులు పేర్లు నమోదులో కూడా అలసత్వం వహిస్తున్నారని మాజీ ఎంపీపీ గొట్లగట్టు ఎంపిటిసి సభ్యుడు ఉడుముల రామనారాయణరెడ్డి, జెడ్పిటిసి సభ్యుడు అక్కి దాసరి ఏడుకొండలు ఎంపీటీసీ సభ్యుడు వెలుగొండ య్య మీరావలి సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశాల్లో ఎంపీపీ ఎం మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కొనకనమిట్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ధ్వజమెత్తారు. సాగర్ నీటి సరఫరా సక్రమంగా జరగక గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని ఆ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మెట్టువెంకటరెడ్డి అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. వద్దిమడుగు కాలనీ నుంచి రెండు విద్యుత్ స్తంభాల ఏర్పాటుచేసి తీగలాగాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులు దృష్టికి తీసుకువచ్చిన ఫలితం లేదని ఎంపీటీసీ సభ్యుడు వెలుగొండయా ఆ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మురళీకృష్ణ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం మండల సర్వసభ్య సమావేశాలకు పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కావడం లేదని అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వైద్యాధికారి ఎస్పీ బాలయ్య ఎంఈఓ ఎస్‌కే దాంగే షరీఫ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నారాయణస్వామి, పశువైద్యాధికారిని అమూల్య, సిడిపిఓ సుధా మారుతి, ఏపిఎం గోపాలకృష్ణ, వ్యవసాయ అధికారి కె ప్రసన్న రంగలక్ష్మి ఏపీవో శ్రీనివాసరెడ్డిలు వారి వారి శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సూపర్నెంట్ పి శ్రీనివాసరావు, సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న క్రీడా సంబరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బుర్ర

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్ర

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి ప్రభుత్వ హైస్కూల్లో శుక్రవారం ఎమ్మెల్యే బుర్ర మధు సూదన్ యాదవ్ జగనన్న క్రీడ సంబరాలను ప్రారంభించి క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్ర మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా అసమాన ప్రతిభ చూపాలన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పుట్టినరోజున క్రీడలలో గెలుపొందిన వారికి మంచి మంచి బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్ గ, ఏఎంసీ సరిత రెడ్డి, రంగనాయకుల రెడ్డి, ఎంపీపీ ప్రకాశం, జెడ్పిటిసి కస్తూరి రెడ్డి, సంగు సుబ్బారెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యరావు, కౌన్సిలర్ శ్రీరాం సతీష్, మురళి, కమిషనర్ నారాయణరావు, కంటు గురవయ్య, ఎంపిడిఓ మల్లికార్జున, దేవరాజు, రాజేష్ తదిరులు పాల్గొన్నారు.

'జగనన్న పాలనలో అన్ని వర్గాల్లో సంతృప్తి'



ప్రజలతో మాట్లాడుతున్న వరికూటి

విశాలాంధ్ర, శింగరాయకొండ : అన్ని వర్గాల ప్రజానీకం జగనన్నకు జేజేలు చెబుతున్నారని, వారిలో సంక్షేమ ఫలాల పట్ల కనిపిస్తున్న సంతృప్తి అనిర్వచనీయమని కొండెపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. శింగరాయకొండ గ్రామంలో రెండవరోజు గడపగడపకు కార్యక్రమం నిర్వహిస్తున్న అశోక్‌బాబు జనాల స్పందన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఇంటిలోనూ ఏదో విధమైన ప్రభుత్వ పథకాన్ని పొందడం, అది కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా మంజూరు కావడం గొప్పవిషయమని ప్రజలు చెబుతుంటే ఆనందంగా ఉందన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గొప్పతనమని ప్రజలకు ఆయన సమాధానమిస్తూ తన పాదయాత్ర కొనసాగిస్తున్నారు. ఒకటో సచివాలయం పరిధిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్య క్రమాన్ని ఆయన నిర్వహించారు. ఆయన వెంట వైద్యవిభాగం అధ్యక్షులు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, గ్రామసర్పంచ్ వనజ, వైస్‌ఎంపిపి రవికుమార్‌రెడ్డి, మండలకోఆప్షన్ మెంబర్ సర్దార్, పటేల్, రావూరి ప్రభావతి, యనమదల మాధవి వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

104 వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

విశాలాంధ్ర-ముండ్లమూరు : కార్పొరేట్ హాస్పిటల్‌కు దీటుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన 104 ద్వారా అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి సిహెచ్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండ లంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల జమ్మలమడక గ్రామంలో శుక్రవారం డాక్టర్ వైయస్ఆర్ క్లినిక్ నందు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతు బయటకు వెళ్లలేని స్థితిలో ఉన్న వారికి గ్రామాల్లోనే వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 104 ద్వారా 67 రకాల మందులు 14 రకాల టెస్టులు చేసి మంచి మందులు అందిస్తున్నామన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ఎంతోమందికి అందిస్తున్న వైద్య సేవల తో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ శిబిరంలో 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో బాలింతలు. గర్భిణీలు, షుగర్, బిపి, జలుబులు దగ్గులు ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ వెంకటరావు, సూపర్ వైజర్ నాగేశ్వరరావు, హెచ్ఇ ఎస్‌కె హుస్సేన్ బి. ఏఎన్ఎం పద్మాంజలి. ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల నిధులను విద్యుత్ బకాయిలకు జమ చేయొద్దు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసే నిధులను విద్యుత్ బకాయిలకు చెల్లించరాదంటూ సర్పంచులు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వ సర్వసభ్య సమావేశం అనంతరం ఎంపీడీవో ఆర్ జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీయులకు విడుదల చేస్తున్న 14వ 15వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా సర్పంచ్లు ఖాతాల్లోని జమ చేయాలన్నారు. నిధులు లేకపోతే పారిశుధ్య కార్మికులకు జీతాలు ఎలా చెల్లించాలి అంటూ వాపోయారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నత అధికారులతో మాట్లాడి నేరుగా సర్పంచుల ఖాతాల్లో జమ చేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో 26 గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాలను అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర-అద్దంకి : విద్యార్థులు సమాజంలో జరుగుతున్న మార్పులు, సాంకేతిక అంశాలను తెలుసుకుంటూ తమ జీవితాలను మార్చు కోవాలని ఇన్‌కంటాక్స్ కమీషనర్ మేకతోటి దయాసాగర్ అన్నారు. శుక్రవారం స్థానిక కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఆర్జెడి దేవపాలన మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకుల సేవలను ఉపయోగించుకొని అభివృద్ధిలోకి రావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహనరావు, ఇండక్షన్ కోఆర్డినేటర్ సాతులూరి దాస్,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

లింగవివక్షకు తావులేకుండా పిల్లలను సమానంగా చూడాలి

విశాలాంధ్ర-అద్దంకి : కుటుంబంలో పిల్లలను లింగవివక్షకు తావులేకుండా ఆడ, మగ పిల్లలను సమానంగా చూడాలని మండల సమాఖ్య ఏరియా కోఆర్డినేటర్ కె,రవికుమార్ అన్నారు. శుక్రవారం అద్దంకి మండల సమాఖ్య ఆధ్వర్యంలో లింగవివక్షను ఇకపై సహించము అంటూ స్థానిక వెలుగు కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు మహిళలు ర్యాలీ నిర్వహించి బంగ్లారోడ్డు కూడలిలో మానవహారం నిర్వహించారు. చదువు,ఆహారం,పోషణ విషయంలో కుటుంబంలో ఆడ,మగ తేడాలేకుండా ఇరువురినీ సమానంగా చూడాలని మండల సమాఖ్య ఏరియా కోఆర్డినేటర్ రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపిఎం వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం విజయవంతం

రోగులను పరిక్షిస్తున్న వైద్యులు

విశాలాంధ్ర-చీరాల : ప్రతినెల నాలుగవ శుక్రవారం రోజున ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం చీరాల ప్రభుత్వ వైద్యశాల లో నిర్వహిస్తు న్నామని, ముఖ్యంగా మహిళలకు రొమ్ము క్యాన్సర్,గరాశేయ క్యాన్సర్,అండాసాయ క్యాన్సర్ లపై అవగాహన కల్పిస్తున్నామని డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. చీరాల ప్రభుత్వ వైద్యశాలలో హెచ్ సి జీ ఎంఎస్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ ఒంగోలు వారి సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామక ృష? రెడ్డి మాట్లాడుతూ మగవారికి పొగాకు,ఖైనిల నుండి సంక్రమించే క్యాన్సర్ లని ముందుగానే గుర్తించి వాటిని ఎదుర్కోవడం ఎలా అనే అంశం పై అవగాహన కల్పిస్తున్నామని, తల, మెడ, రక్త, ఊపిరితిత్తుల క్యాన్సర్‌లపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. సామాన్య ప్రజలు క్యాన్సర్‌ను జయించి జీవితంలో బాగుండాలని సదుద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎక్సిక్యూటివ్ సిహెచ్ శరత్ బాబు, వినీల్ డాక్టర్ పున్నారావు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో నాణ్యమైన ఎరువులను ఉపయోగించుకోవాలి

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి డి జవహర్లాల్ నాయక్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన ఎరువులు రైతులు వినియోగించుకొని అధిక దిగుబడులు సాధించాలని పెద్దదోర్నాల మండల వ్యవసాయఅధికారి డి జవహర్లాల్ నాయక్ కోరారు. మండలంలోని చిన్న గుడిపాడు, కటకానిపల్లి, రైతు భరోసా కేంద్రంలో ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో యూరియా 20:20:0:13, మరియు 28:28:0 రైతులకు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అమలవుతున్న పథకాలు వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం, రైతు భరోసా పథకం, పీఎం కిసాన్ పథకం ఈ క్రాప్ గురించి రైతులకు ఏవో జవహర్లాల్ నాయక్ వివరించారు. పీఎం కిసాన్ పథకం కింద ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఈ సందరర్భంగా రైతులకు ఎరువులు మరియు ఈ క్రాపు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హరిజన నాయక్, గ్రామ ఉద్యానవన సహాయకులు డి శ్వేత, రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో సమావేశమైన పీడీ

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండలంలోని తోకపల్లి గ్రామములో జగనన్న లేఅవుట్‌లోని లబ్ధిదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్పెషల్ అధికారి జిల్లా డ్వామా పీడీ కె.సీనారెడ్డి పాల్గొన్నారు. ముందుగా లేఅవుట్‌ని పరిశీలించారు. అనంతరం తోకపల్లి గ్రామంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిడి మాట్లాడుతూ జగనన్న లే ఔట్ ఉన్న లబ్ధిదారులు అందరూ త్వరగా ఇల్లులు పూర్తి చేయాలని తెలియచేశారు. ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. బిల్లులు కూడా వెంటనే మంజూరు చేస్తామని వారికి చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రాజ్ కుమార్, ఏపిఓ సాంబ శివయ్య, ఏపీఎం శ్రీనివాసులు, జిలెల్ల మల్లీశ్వరి, టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సచివాలయం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ నిర్మాణ పనులు చేపట్టాలి

లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల స్థాయి అధికారులు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గొట్లగట్టు గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్లను శుక్రవారం తహశీల్దార్ కె.వి.ఆర్.వి ప్రసాద రావు మండల స్థాయి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను పిలిపించి ఇప్పటికీ నిర్మాణ పనులు చేపట్టిన వారుంటే వెంటనే నిర్మాణాలు చేపట్టాలని వారికి సూచనలు సలహాలు చేశారు. లబ్ధిదారులు వారివారి సమస్యలను అధికారులకు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిసుకుదేవ్, నాయకులు పెద్దకాశిరెడ్డి, ఎంపీడీవో జనార్ధన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నారాయణస్వామి, ఏపిఎం గోపాలకృష్ణ, వీఆర్వో దిలీప్ కుమార్, సర్వే రవితేజ, హౌసింగ్ ఏఈ ఏపీఓ సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు
మహారాజశ్రీ మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
G.W.O.P:14/2022
1. Muda Geetha, Aged 10 years
2. Muda (a) Mudha Yaswanth Naik aged 6 years Being Minors Represented by their Grand Father Muda Chinna Pullaiah Naik S/o. Raja Naik Aged 70years D.No: 1-1q Pedda Kandukur Mittameddi palle Ardhraveedu (mandal) Prakasam Dist) - Petitioners
Vs
Nill - Respondent
ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా పై నెంబరు G.W.O.P లోని మైనర్లు అయిన 1. Muda Geetha, 2. Muda (a) Mudha Yaswanth పిటీషనర్ల తండ్రి అయిన Bheema Naik, Armyలో ఉద్యోగం చేయుచు 26-11-2021వ తేదీన చనిపోయి నాడు. తదుపరి పిటీషనర్లు తల్లి అయిన కృష్ణ కుమారి కూడా 4-8-2022వ తేదిన చనిపోయి నది. తరువాత పిటీషనర్లు వారి Grand Father అయిన Muda Chinna Pullaiah Nayak సంరక్షణలో వున్నారు. వారి యోగక్షేమాలు చూసు కొను చున్నాడు. అయితే పిటీషనర్లు చదువులు మరియు వారి అవసరాలు తీర్చు నిమిత్తము, పిటీషనర్లు తండ్రి తాలూకు Pensionary benfits death benfits and Other benfits ను Army Authrities వారి వద్ద తీసుకొను నిమిత్తము పిటీషనర్లు Grand Father, Mudha Chinna Pullaiah Nayak ను Guardian గా Appoint చేయుటకు పై నెంబరు G.W.O.Pని దాఖలు చేసినందున, ఇందు విషయమై ఎవరికైనను ఎలాంటి ఆక్షేపణలు వున్న యెడల ది.20-12-2022వ తేది ఉదయం 10.30నిIIలకు పై కోర్టులో స్వయముగా గాని అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియ జేసుకోనవలసినది. లేని యెడల పరోక్ష మందు విచారించి తీర్మానించబడును.
వాయిదా తేది : 20-12-2022
(కోర్టు వారి అనుమతితో)
R. Chinna Saidulu Naik B.A, LLB
పిటిషనర్ల తరపు అడ్వకేట్
మార్కాపురం

అర్హులకు స్థిరనివాసం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి

కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-దర్శి : అర్హులైన ప్రతి కుటుంబానికీ స్థిరనివాసం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన దర్శి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. తొలుత జగనన్న అర్బన్ లేఅవుట్ను సందర్శించి ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడి ఇళ్ల నిర్మాణంలో వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకోవడంతోపాటు వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం చేస్తున్న సహాయం గురించి వారికి వివరించారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలకు అదనంగా లబ్ధిదారులు స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉంటే మరో రూ.35 వేలు, లబ్ధిదారులు ఎస్.సి, ఎస్.టి. వర్గాల వారైతే ఉన్నతి. పథకం క్రింద అదనంగా మరో రూ.50 వేల ఆర్థిక సహాయం చేస్తుందని కలెక్టర్ తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు బిల్లులను కూడా వెంటనే లబ్ధిదారుల ఖాతాలలో ప్రభుత్వం జమ చేస్తోందని చెప్పారు. ఇళ్లు త్వరగా పూర్తవడానికి ప్రతి వారం "హౌసింగ్ డే" పేరుతో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి కావడానికి లేఅవుట్లలో అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని. వివరించారు. స్వతహాగా కట్టుకోలేని వారికి నిర్దిష్ట బడ్జెట్లో ప్రభుత్వమే నిర్మించి ఇచ్చే విషయాన్ని కూడా పరిశీలిస్తామని ఆయన చెప్పారు. నిర్మాణానికి ముందుకు వచ్చిన లబ్ధిదారుల ఇళ్లకు ఈ సందర్భంగా కలెక్టరు శంకుస్థాపన చేశారు. నాణ్యమైన విద్యాబోధన, పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టరు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల. డిగ్రీకళాశాల ప్రాంగణాన్ని ఆయన సందర్శించి నాడు - నేడు కార్యక్రమంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నాణ్యతలో రాజీపడకుండా ఈ పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన బెంచీలను ఏర్పాటు చేసి త్రాగునీటి సౌకర్యాన్ని మెరుగుపరచాలని దిశా నిర్దేశం చేశారు. ఈ ప్రాంగణంలోని ప్రతి తరగతిని పరిశీలించి విద్యార్థులకు బోధన అందిస్తున్న తీరును గమనించారు. 6వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు చెప్తున్న విధానాన్ని కొద్ది సేపు తరగతి గదిలో విద్యార్థులతో కలిసి కూర్చుని కలెక్టరు పరిశీలించారు. ఈ ప్రాంగణంలో మురుగుదొడ్లకు సమీపంలోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయడాన్ని గమనించిన కలెక్టరు, సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట చేసే స్థలాన్ని మార్చాలని ఆయన ఆదేశించారు. ఇదే ప్రాంగణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని కూడా కలెక్టరు తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పోషకాహారం గురించి సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు క్రమంగా వైద్య పరీక్షలు చేయిస్తూ వారి ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.దర్శి-4 సచివాలయాన్ని కూడా కలెక్టరు సందర్శించారు. సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సచివాలయ పరిధిలో బాల్య వివాహాలు జరుగకుండా చూడాలని, నిర్దిష్ట గడువులోగా ప్రజలకు సేవలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. కాగా సాంకేతిక సమస్యల వల్ల గత రెండు నెలలుగా సిబ్బందికి. జీతాలు రావడం లేదని ఎం.పి.డి.ఓ. చెప్పగా, రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టరు చెప్పారు. ఖాళీ పోస్టుల భర్తీకి కూడా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టరు వెంట హౌసింగ్ పి.డి. పేరయ్య, మెప్మా పి.డి. రవి కుమార్, ఆర్.డి.ఓ. సందీప్ కుమార్, ఎం.పి.డి.ఓ. కుసుమ కుమారి, తహశీల్దారు శ్రావణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్, పలువురు మండల స్థాయి అధికారులు ఉన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర టౌన్-ఒంగోలు : దళితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర ఎస్.సి.కమిషన్ సభ్యులు చెల్లం ఆనంద్ ప్రకాష్ స్పష్టం చేశారు. శుక్రవారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత వర్గాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని అన్నారు. దళిత క్రైస్తవులను ఎస్.సి.లలో చేర్చేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని ఆయన తెలిపారు. దళిత క్రైస్తవులను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందంటూ కొందరు అపోహలు సృష్టిస్తున్నారని, ఈ ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని ఆయన కోరారు. దేశంలోని దళితులను, దళిత క్రైస్తవులను అక్కున చేర్చుకున్న ప్రభుత్వం మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రమేనని ఆయన చెప్పారు. ఆనాడు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి దళిత క్రైస్తవులను ఎస్.సి.లలో చేర్చే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని ఆనంద్ ప్రకాష్ గుర్తు చేశారు. గతంలో రంగనాథ్ కమిషన్, రాష్ట్రంలో పున్నయ్య కమిషన్ దళిత క్రైస్తవులను ఎస్.సి.లలో చేర్చాలని నివేదిక ఇచ్చినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నియమించిన బాలకృష్ణ కమిషన్కు కూడా. రాష్ట్రంలోని దళిత క్రైస్తవులను ఎస్.సి.లలో చేర్చాలని ఎస్.సి. కమిషన్ ద్వారా త్వరలో వినతి పత్రం. అందజేస్తామన్నారు. ఆనాడు జనాభా రీత్యా రాజ్యాంగం 15 శాతం రిజర్వేషన్ కల్పించిందని, ప్రస్తుత జనాభా పెరిగిన దృష్ట్యా 25 శాతం రిజర్వేషన్ పెంచాలని కమిషన్ గుర్తించిందన్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ విషయం మీద చర్యలు తీసుకోవడానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి లక్ష్మానాయక్, ఇతర అధికారులు, ఎస్.సి. సంఘ నాయకులు పాల్గొన్నారు.

'నాడు - నేడు'తో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు : ఎమ్మెల్యే అన్నా

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

విశాలాంధ్ర-బేస్తవారిపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు నేడు పథకం ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు నేడు ఫేజ్-2 కింద రూ. 37 లక్షలతో నిర్మించే అదనపు తరగతి గదుల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో పాటు క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యనందిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరాలని ఆకాంక్షించారు. ఈ సందరర్భంగా ఎమ్మెల్యే అన్నా రాంబాబును పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జడ్పీటీసీ బండ్లమూడి వెంకటరాజు, సర్పంచ్ తాళ్ల అరుణ, ఎంపీటీసీ బండి నాగారత్నమ్మ, ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు, ఏపీఎం రఘునాథ్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ భాస్కర్‌రావు, పీసీ కమిటీ చైర్మన్ కృష్ణంరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, వైస్సార్ సీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు సక్రమంగా అమలు చేయాలి

దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బి రమణమూర్తి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్క దారి పట్టకుండా సక్రమంగా అమలు చేయాలని, ఉప ప్రణాళిక చట్టం పది సంవత్సరాల కాల పరిమితి ఎత్తివేసి చట్టబద్ధత చేయాలని రాష్ట్ర దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బి రమణమూర్తి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన ఒంగోలులోని ప్రెస్ క్లబ్ నందు జిల్లా స్థాయి సదస్సు నిర్వహించడం జరిగింది.

ఈ సదస్సుకి దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత గిరిజన పిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్లో తగిన అవకాశాలు కల్పించాలని, గురుకులాల్లో సరైన అవకాశాలు లేక ఆడపిల్లలు ఇబ్బందులు పడుతున్నారని అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ పిల్లలు పై చదువులు చదువుకోవాలంటే డిగ్రీ గురుకులాలు ఏర్పాటు చేయాలని, వారు అన్నారు. ప్రకాశం జిల్లా మాజీ డిప్యూటీ కలెక్టర్ కె. పేరయ్య మాట్లాడుతూ ఎస్సీ లకు కేటాయించిన బడ్జెట్లో 80 శాతం మాత్రమే నిధులు ఖర్చు చేశారని అదేవిధంగా ఎస్టీలకు కేటాయించిన నిధుల్లో కూడా పూర్తిగా ఖర్చు పెట్టకుండా 79 శాతం మాత్రమే ప్రభుత్వాలు ఖర్చు చేశారని ఆయన తెలియజేశారు. దళిత వేదిక జాతీయ అధ్యక్షులు చప్పిడి వెంగళరావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ద్వారా కేటాయించిన నిధులు మొత్తం కూడా ఆయా వర్గాలకు మాత్రమే ఖర్చు చేయాలని వారన్నారు. కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి రాఘవులు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ 10 సంవత్సరాల కొనసాగించినప్పటికీ ఎస్సీ ఎస్టీ కులాల్లో అభివృద్ధి ఆశించిన స్థాయిలో రాలేదని కనిపించలేదని కాబట్టి సబ్ ప్లాన్ చట్టం ను శాశ్వత ప్రణాళికగా రూపొందించాలని ఆయన అన్నారు. ఈ సదస్సుకు పౌర సమాజ నాయకులు గుమ్మల్ల నరసింహారావు, జై భీమ్ సేవాదళ్ జాతీయ అధ్యక్షులు జాలాది మోహన్, యానాది సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఈగ శ్రీనివాసరావు, డివైఎఫ్ జిల్లా అధ్యక్షులు వినోద్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బిల్లా శరత్, దళిత బహుజన రిసోర్ సెంటర్ ఒంగోలు పట్టణ కమ్యూనిటీ మొబైల్ లైజర్ ఎం ఆదినారాయణ, దర్శి, ముండ్లమూరు కమ్యూనిటీ మొబలైజర్స్ గోపనబోయిన వెంకట్రావు, గుంటూరు నాగమణి, జిల్లాలోని వివిధ మండలాల నుండి ఎస్సీ,ఎస్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువత వృత్తి నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు ఏర్పరుచుకోవాలి

ఫర్నిచర్ ఇండస్ట్రీ షాపునుప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్ చిత్తూరి హారిక

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : పెద్దదోర్నాల మండలం కొత్తూరు గ్రామానికి నిరుద్యోగ యువకుడు సింగా గురువయ్య మండలకేంద్రమైన పెద్ద దోర్నాల శ్రీశైలం రోడ్డులో నూతనముగా ఏర్పాటు చేసుకున్న "క్రితిక ఫర్నిచర్ ఇండస్ట్రీ షాపును శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పెద్ద దోర్నాల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిత్తూరి హారిక ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతి యువకులు తమసామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని మెరుగుపరచుకొని స్వతంత్రం గా ఉపాధి అవకాశాలు ఏర్పరచుకోవడం అభినందనీయం అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు తమవంతు సహాయసహకారాలు అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో క్రితిక ఫర్నిచర్ ఇండస్ట్రీ షాప్ యజమాని సింగా గురువయ్య, అభిమానులు పాల్గొన్నారు.

జస్టిస్ మాంధాత, దండేలను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు

విశాలాంధ్ర-గిద్దలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మెన్ జస్టిస్ మాంధాత సీతారామ మూర్తి, కమిషన్ సభ్యులు (జుడిషియల్) దండే సుబ్రహ్మణ్యంలు కర్నూలు నుంచి విజయవాడ అధికారిక పర్యటనలో భాగంగా శుక్రవారం గిద్దలూరు రావడం జరిగింది. ఈసందర్భంగా గిద్దలూరు తహశీల్దారు రాజా రమేష్ ప్రేమ్ కుమార్ మరియు వీఆర్‌ఓల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.పి.రంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఏ.వెంకట్రామయ్య మరియు సిబ్బంది న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిశారు.

పచ్చాకు ముఠా కూలీలను పట్టించుకోని పాలకులు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

విశాలాంధ్ర- టంగుటూరు : జిల్లాలో పనిచేస్తున్న పచ్చాకు ముఠా కూలీలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, రక్షణ చట్టం సాధన కోసం సమైక్యంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఎం నిడమాలూరు గ్రామంలో పచ్చిపొగాకు ముఠా కూలీలు, మేస్త్రీలు, టోకర్లు, డ్రైవర్ల సమావేశం పిడుగురాళ్ల లింగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో 130 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అవుతుండగా సుమారు 100 మిలియన్ కేజీల పైగా ప్రకాశం జిల్లాలోనే ఉత్పత్తి అవుతుందని తెలిపారు. పొగాకు ఉత్పత్తి మీద ఆధారపడి దేశంలో 60 లక్షల మంది రైతులు, 2 కోట్ల మంది కూలీలు ఉన్నారని తెలిపారు. వీరి శ్రమ ద్వారా ఉత్పత్తి అవుతున్న పొగాకు ప్రపంచంలోని 100 దేశాలకు ఎగుమతి అవుతుందన్నారు. దేశంలో పొగాకు ఉత్పత్తులు అమ్మకం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు 54 వేల కోట్ల రూపాయల అమ్మకం పన్ను రూపంలో ఆదాయం వస్తుందనీ తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున ఆదాయం రావడానికి కారణమైన రైతులు, కూలీల గురించి పొగాకు బోర్డ్ కానీ, ప్రభుత్వాలు కానీ పట్టించుకోవట్లేదు అని తెలిపారు. ఈ సమావేశంలో ముఠా కూలీలు మేస్త్రీలు, పీ.లింగయ్య, గుంటి దాసు, పిడుగురాళ్ల వెంకటేశ్వర్లు, చాట్రగడ్డ జ్యోతి, మద్దులూరి కోటయ్య, జాలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సీఈసీలో సినిమా షూటింగ్ సందడి

విశాలాంధ్ర-చీరాల : చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. వేటపాలెంకి చెందిన నూతన డైరెక్టర్ కట్టా జై దర్శకత్వంలో కృష్ణకాంత్, విజయ్ ప్రధాన పాత్ర పోషించిన సినిమా షూటింగ్ చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి రవికుమార్ క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వేటపాలెం ప్రాంతానికి చెందిన కట్టా జై ఈ సినిమాకి దర్శకత్వం వహించడం హర్షణీయమన్నారు. ఈ సినిమా ఘన విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ జై మాట్లాడుతూ మహిళల పట్ల వివక్షత, బాలిక విద్య, ప్రాధాన్యత అంశాలతో కూడిన వైవిధ్యమైన కదా సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. అనంతరం సినిమా షూటింగ్ జరిపారు తరగతి గదిలో సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు అవగాహన

మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ మాధవీలత

విశాలాంధ్ర - టంగుటూరు : మండల కేంద్ర మైన టంగు టూరు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ల సూపర్వైజ ర్లుకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆరోగ్యశాఖ జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డిప్యూటీ డిఎంహెచ్ఓ మాధవీ లత మాట్లాడుతూ సీజన్ వ్యాధులను వర్షాకాలం గనుక అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని డాక్టర్లకు తెలియజేశారు. పూర్తిస్థాయిలో వ్యాక్సిన్ కూడా వేయాలని టీకాలు బాలింతలకు సౌకర్యం కలిగించాలని పోషకాహారాలు చూడాలని చూసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్ డాక్టర్ శిరీష డాక్టర్ మాధవి లత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొండా వెంకట లక్ష్మమ్మకు బీఎంసీ నివాళి

కొండా వెంకట లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న బీఎంసీ

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని కంబాల దిన్నె గ్రామానికి చెందిన కొండ వెంకట కొండయ్య మాతృమూర్తి వెంకట లక్ష్మమ్మ శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి టిడిపి నాయకులు బొల్లా మాల్యాద్రి చౌదరి వెంకట లచ్చమ్మ పార్థివ దేహానికి పూలమాలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గ్రామ టిడిపి అధ్యక్షులు మన్నెం రమణయ్య, టిడిపి హై కోఆర్డినేటర్ గొల్ల వీరబాబు, దేవరపు మాల్యాద్రి, కొండా వెంకట కొండయ్య, కొండ మనోజు, నల్లబోతుల శీను, నల్లపోతుల ప్రభాకర్ పాల్గొని నివాళులు అర్పించారు.

రేపు కనిగిరి నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయండి

మండల సీపీఐ కార్యదర్శి పోతల ప్రభాకర్

విశాలాంధ్ర-పామూరు : ఈ నెల 27న కనిగిరి లో జరుగు నియోజకవర్గ సిపిఐ జనరల్ బాడీ సమావేశమును జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశం కనిగిరిలోని ఎంజీఆర్ కళ్యాణ మండపంలో జరుగుతుందన్నారు. గ్రామ స్థాయి నుండి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, నూతన శాఖలు ఏర్పాటు, ప్రజా సంఘాలు విద్యార్థి యువజన సంఘాల వైపు యువతను ఆకర్షించడం మొదలగు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది. ముఖ్యమైన ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ హాజరవుతారు. మండలంలో ముఖ్య నాయకులు అందరూ హాజరు కావలసిందిగా ప్రభాకర్ కోరుచున్నారు.

రాష్ట్రంలో రాజ్యాంగ వ్యతిరేక పాలన

మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

విశాలాంధ్ర-కనిగిరి : రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి రాజ్యాంగ వ్యతిరేక పాలన చూసి ఇదేమి ఖర్మ నా రాష్ట్రానికి అని ప్రజలు గగ్గోలు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్చార్జ్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్ లో జరిగిన మీడియా సమావేశంలో టీడీపీ నాయకులతో కలిసి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రజాస్వామ్యం అపహాస్యం అయ్యేలా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం అనే పదం అర్థమే మారిపోయిందన్నారు. అప్రజాస్వామిక విధానాల ద్వారా ప్రజల గొంతుకను అణచివేయ్యాలని వైసీపీ ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. ఆంధ్రప్రదేశ్ బీహార్ రాష్ట్రాన్ని తలదన్నేల వ్యవహరిస్తోందన్నారు. వైసీపీ వచ్చాక రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగుతోంది. న్యాయమూర్తులు, న్యాయవ్యవస్థలను దూషిస్తే వారే పిటిషన్ వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అర్థరాత్రి పోలీసులు అక్రమంగా ఎత్తుకెళ్లడం, నిర్బంధించడం ఈ వైసీపీ పాలనలో నిత్యక ృత్యం అయినది. పోలీసులును అడ్డం పెట్టుకుని వారి సహాయంతో గడప..గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుపుకునే స్థితిలో వైసీపీ నాయకులు ఉన్నారంటే ప్రజలు ఈ వైసీపీ పాలన ప్రజలకు ఖర్మ ఎప్పుడు పోతుందా అని ఎదురు చూస్తున్నారని అన్నారు. వాళ్ళు. వీళ్ళు అనే తేడా లేకుండా అన్ని వర్గాలును ఇబ్బంది పెడుతున్న వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజలు విసిగెత్తి ఈ ఖర్మను తొందరగా వదిలించుకోవాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల వలసలు అరికట్టాలి



విశాలాంధ్ర-జెపంగులూరు : వ్యవసాయ పనులు సక్రమంగా లేక, ఉన్న కొద్దిపాటి పనులకు కూడా సరైన కూలీ లేక, వ్యవసాయ కూలీలు వలసలు పోయే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం ఈ వలసలను నివారించే విధంగా కూలీలకు, ఉపాధి చూపించాలని, వ్యవసాయ కార్మిక సంఘం పంగులూరు మండల కమిటీ సమావేశం తీర్మానించింది. మండల కమిటీ సమావేశం శుక్రవారం పంగులూరులో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండలంలో వ్యవసాయ పనులు కొద్దిపాటి మాత్రమే ఉన్నాయని, పనులు లేక అనేక గ్రామాల ప్రజలు ఆటోలలో ఇతర గ్రామాలకు వలసలు వెళ్తున్నారని, కూలి కూడా 200, 250 మించి ఇవ్వట్లేదని, డిసెంబర్ నుండి పొగాకు పనులకు మండలం నుండి, భారీ సంఖ్యలో వరుసలు వెళ్లే అవకాశం ఉంది. ఉపాధి హామీ పనులు గత కొన్ని సంవత్సరాలుగా గ్రామాల్లో సక్రమంగా జరగకపోవడం వల్ల వ్యవసాయ కార్మికులు ఎక్కువమంది వలసలు పోతున్నారని సమావేశం ప్రకటించింది. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ కన్వీనర్‌గా, పూసపాటి సుబ్బరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా తానికొండ సుధాకర్, పోతుగంటి ఆదుం సాహెబ్, చింతలచెరువు ఏలియా, నాగేశ్వరరావు, హరిబాబులను ఎన్నుకున్నారు.

వరిలో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

విశాలాంధ్ర-దర్శి : దర్శి మండలం బోట్లపాలెంలో ఏపీఐ, ఐఏపి వారి అధ్వర్యంలో ధృవీకరణ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రభాకర్ మాట్లాడుతూ వరిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలని, నిర్ధారించినటువంటి ఎరువులు పురుగుమందులు వాడిన వారికి ఈ యొక్క మేలైన యాజమాన్య పద్ధతుల ఉత్పత్తులు, ధ్రువీకరణ పత్రం అందించడం జరుగుతుందని, దీనిలో భాగంగా 250 ఎకరాలకు గాను వరి పంట వేసినటువంటి 120 మంది రైతులకు ఈ యొక్క వరిలో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపినారు. వ్యవసాయ పరిశోధన స్థానం దర్శి నుంచి తూము వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో వచ్చు పురుగులు మరియు తెగుళు వాటి యొక్క లక్షణాలు వాటిని నివారించు చర్యలు గురించి వివరించినారు. అలాగే రైతులు కూడా వాటి యొక్క వివరణ పై పురుగులు తెగుళ్లు పై సందేహాలను నివృత్తం చేయడం జరిగింది. దర్శి మండల వ్యవసాయ అధికారి వి. బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో ఉన్నటువంటి పథకాల గురించి మరియు వ్యవసాయ శాఖలో ఉన్నటువంటి సబ్సిడీ పథకాలు గురించి, ఈ క్రాఫ్ బుకింగ్ వల్ల కలుగు లాభాలు గురించి వివరించడం జరిగింది. జిల్లా రైతు శిక్షణ కేంద్రం నుంచి వ్యవసాయ అధికారులు సుచరిత, స్వర్ణలత మాట్లాడుతూ వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు ధ్రువీకరణ వాటి యొక్క విధి విధానాలు మరియు పొలంబడి శిక్షణ గురించి శిక్షణ కార్యక్రమాల గురించి పొలంబడి చేయు విధానం గురించి వివరించడం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి యస్.వెంకట్రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు బాజీ మరియు ఎఫర్ట్ సంస్థ సుధాకర్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు

చిల్ల చెట్ల తొలగింపు

చిల్ల చెట్లను తొలగిస్తున్న సర్పంచ్ కత్తి రాజారావు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : హెచ్‌ఎం పాడు గ్రామపంచాయతీలో మండల కన్వీనర్ సొసైటీ బ్యాంక్ చైర్మన్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో మండలలోని ప్రజా సమస్యలను తీర్చేందుకు శుక్రవారం ఎస్సీ కాలనీ నందు దట్టంగా పెరిగిన చిల్లచెట్లను మండల సర్పంచ్ కత్తి రాజారావు జెసిబి ద్వారా తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా యక్కంటి శ్రీనివాసులురెడ్డి మరియు మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి కలసి 6వ వార్డును సందర్శించి చిల్లచెట్లను తొలగించే కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మిగతా ప్రాంతాల్లో కూడా పెరిగిన చెట్లను పరిశీలించి తొలగిస్తామన్నారు. అలానే ఎమ్మెల్యే ఆశయాలను అనుగుణంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినందున సర్పంచ్ కత్తి రాజారావు గ్రామానికి ఆదర్శంగా నిలిపారని యక్కంటి శ్రీనివాసరెడ్డి వారిని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తదితర వైసీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఏబీఎం చర్చ్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

క్రీస్తు పుట్టుక నాటకాన్ని ప్రదర్శించిన బాలబాలికలు

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక ఏబీయం చర్చ్‌లో యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సండేస్కూల్ టీచర్స్ ఉప్పలపాటి ప్రశాంతి, వై.మేరీబా నేతృత్వంలో బాలబాలికలు క్రీస్తు పుట్టుక నాటకాన్ని ప్రదర్శించి అందరిని అలరించారు. మానవాళి రక్షణార్థమై ధనవంతుడే దీనుడై లోక రక్షకుడుగా కీస్తు జన్మించిన విధానంను పాస్టర్ ప్రభుదాసు వివరించారు. అనంతరం సంఘ అధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి కె.విల్సన్, కోశాధికారి ఎన్.సుధీర్ మరియు కమిటీసభ్యులతో కలిసి ఆయన క్రిస్మస్ కేకును కట్ చేసి అందరికి పంచి పెట్టారు. యువకులు చేసిన క్రిస్మస్ స్టార్, విద్యుత్ దీపాలతో చర్చ్ అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

బస్సు పాసుల పంపిణీ

విశాలాంధ్ర-యద్దనపూడి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వివిధ పథకాలను పర్చూరు నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో విరివిగా పంపిణీ చేస్తున్నామని యద్దనపూడి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, గన్నవరం గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరు వేణు అన్నారు. ఆయన మండలంలోని అన్ని గ్రామాలతో పాటు గన్నవరం గ్రామంలో 20 మంది వికలాంగులు, వితంతువులకు బస్సు పాసులు పంపిణీ చేసే కార్యక్రమంలో శుక్రవారం నాడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 20 మందికి 50 శాతం సబ్సిడీతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం ప్రయాణించే బస్సు పాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పల్లె పోగు అన్నమ్మ, ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్ కుమార్, షేక్ జాఫర్ ఖాన్ ఇంకా గ్రామ పెద్దలు, గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామంలో కళ్యాణ లక్ష్మి పథకానికి సర్టిఫికెట్ మంజూరు కాగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించేందుకు ఎస్సీ ,ఎస్టీ ,ఓబీసీ, ముస్లిం మైనారిటీలకు మైనార్టీలకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు అర్హత కోసం పర్చూర్ నియోజవర్గం లోనే మొట్టమొదటిగా వివాహ ధృవీకరణ పత్రాన్ని లబ్దిదారులు షేక్ సుభాన్ బి, పటాన్ కాజా కరీం దంపతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత.. పారిశుధ్యానికి ప్రాధాన్యత

సచివాలయ తనిఖీలో కలెక్టర్ దినేష్ కుమార్

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-తాళ్లూరు : గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతకు, పారిశుద్ధ్యనికి అధిక ప్రాధాన్యత నివ్వాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని తూర్పు గంగ వరం గ్రామంలో గల సచివాలయాన్ని శుక్రవారం కలెక్టర్ దినేష్ కుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాన్ని, పరిసరాలను పరిశీలించి సచివాలయ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన సచివాలయ సిబ్బందిని ఒక్కొక్కరిని పరిచయం చేసుకుంటూ వారి విధులను గురించి వారి పనితీరును గురించి ఆరా తీశారు. సచివాలయం పరిధిలో ప్రతిరోజు 150 వరకు సమస్యలను పరిష్కరిస్తున్నట్లు సిబ్బంది ఆయన దృష్టికి తెచ్చారు. దీనితో ఆయన సిబ్బందిని అభినందించారు. తూర్పు గంగవరం గ్రామంలో ట్రాఫిక్ సమస్య అత్యధికంగా ఉందని, పారిశుద్ధ్య పనులు కూడా సక్రమంగా జరగటం లేదని కొందరు గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందిస్తూ వెంటనే ట్రాఫిక్ సమస్యను నివారించాలని, పారిశుద్ధ్యన్ని కాపాడాలని అధికారులకు తగిన సూచ నలు ఇచ్చారు. బాల్య వివాహాలు జరగకుండా పర్యవేక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎస్ రామ్మోహన్ రావు, వీఆర్వో రాఘవరెడ్డి, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామ వైసిపి నాయకులు గోపిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి(చందన), గుజ్జుల యోగిరెడ్డి, చాట్ల ఇమ్మానుయేలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండల పరిధిలోని ఆర్డిటి ఆధ్వర్యంలో గవర్నమెంట్ హైస్కూల్లో ఆర్డిటి ఆడిటోరియంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవంను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం ట్రాన్స్ పోర్టు డైరెక్టర్ నిర్మల్ పాల్గొనడం జరిగింది. ముందుగా ఈ కార్యక్రమాన్ని ర్యాలీతో, దోర్నాల మండలం గూడెం మరియు ఆర్‌డిటి వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కి పూలమాలవేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా నందిగూడెం నాగమ్మ మహిళా మాట్లాడుతూ ఇక్కడ మా ఏరియాకి ఆర్డిటి సంస్థ వచ్చిన తర్వాత మా మహిళల్లో చాలా మార్పు వచ్చింది, చాలా మటుకు పొదుపు చేసుకోవడం పిల్లల్ని బడికి పంపించడం,చిన్నపిల్లలకి పెళ్లి చేయకపోవడం మా చెంచుగుడాలలో చాలా మార్పు తీసుకొని వచ్చినందుకు, ఆర్ డి టి సంస్థకు ధన్యవాదాలు తెలిపింది. మరియు నల్లగుంట్ల పెద్దన్న మాట్లాడుతూ మా గుడాలలో మగవారు అనేది బయటకు వచ్చేవాళ్ళు కాదు ఆర్‌డిటి సంస్థ వచ్చిన తర్వాత మగవారిలో చాలా మార్పు వచ్చింది, అని ఎవరితోనైనా మాట్లాడగలుగుతున్నారు. నిర్మల్ మాట్లాడుతూ ఆర్డిటి సంస్థ 53 సంవత్సరాల నుండి అనంతపురంలో పనిచేస్తుంది ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఒకటే ఆశయం అందరికీ కూడు గూడు గుడ్డ అందరూ సమానం అని భావించే వాడు అదే సంకల్పంతో ఆర్డిటి సంస్థ పని చేస్తుంది. అలాగే ఇక్కడ చెంచులలో చాలా మార్పులు తీసుకొచ్చింది ఇంకా మార్పు చెందాల్సి ఉంది కచ్చితంగా ఆర్ డి టి మీరు పూర్తిగా మారేంతవరకు కృషి చేస్తుంది అని తెలిపారు.ఇంకా ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు ఆర్డిటి చేస్తుంది ఆర్డిటి కోరుకునేది ఆడవారు మగవారు అందరూ సమానమే అందరూ కలిసిమెలిసి పనిచేసుకొని జీవితం బాగుపరచు కోవాలి అనే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండలం చెంచుగూడెం ప్రజలు మరియు ఆర్‌డిటి సిబ్బంది పాల్గొనడం జరిగింది.

పొలంబడిపై అవగాహన

మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

విశాలాంధ్ర-చీరాల : పొలంబడి పై శిక్షణా కార్యక్రమం, మంచి యాజమాన్య పద్ధతులు, ధ్రువీకరణ పై శిక్షణ ఇవ్వడం జరిగిందని గ్రామస్థాయి వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించినాణ్యమైన ఉత్పత్తులు పండించి రైతు మంచి ధర రాబట్టేలా వీఏఏలు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాస్త్ర వేత్త రమేష్ అన్నారు. చీరాల ముస్లిం షాదీ ఖానాలో చీరాల డివిజన్ పరిధిలోని మూడు మండలాల ఆర్.బి.కె వీఐఏతో వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు క్రిమిసంహార మందులు ఎలా తగ్గించాలి అలాగే తెగుళ్ళ నివారణకు సంబంధించిన, సూచనలను తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెడి అబ్దుల్ సత్తార్,డిప్యూటీ జెడి విజయనిర్మల, ఏడిఏ ఉషారాణి,చీరాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి, మూడు మండలాల ఏవోలు సుమతి, కాశీ విశ్వనాథ్, భాస్కర్, మూడు మండలాల వీఏలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎంపికైన విద్యార్థులు, కళాశాల సిబ్బంది

విశాలాంధ్ర-చీరాల : విద్యార్థులు చదువులోనే కాక క్రీడలలోను రాణించాలని, అండర్19 స్థాయిలో పాల్గొనే విద్యార్థులు జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, దేశ స్థాయిలో పాల్గొనేందుకు మొదటి మెట్టు ఇదేనని ఆర్‌ఐఓ సైమన్ విక్టర్ అన్నారు. శుక్రవారం చీరాల సెయింట్ మార్క్స్ లుదరన్ కళాశాల ఆవరణలో అండర్19 కబడ్డీ జట్టు ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ కళాశాల స్థాయిలో విద్యార్థులు తమకు నచ్చిన ఆటలను ఎంచుకుని జాతీయ స్థాయిలో రాణించి,గుర్తింపు పొందవచ్చని అన్నారు. చదువుతో పాటు ఆటలలో రాణించడం వలన విద్యార్థులకు మానసిక స్థైర్యం ఏర్పడుతుందని, ఆటలలో సహజంగానే పోటీతత్వం ఉంటుందని ఆటలతో పాటు విద్యార్థులు చదువులో కూడా పోటీతత్వం అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ మార్క్స్ లూథరన్ కళాశాల ఎఫ్‌ఏసి ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు, కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్,జిల్లా నలుమూలల నుండి పిడీలు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

హర్షిణీ డిగ్రీ కాలేజ్‌లో అల్లూరి జయహే

విశాలాంధ్ర-మార్టూరు : రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో అల్లూరి జయహే కార్యక్రమమును మరియు ఇంట్రాక్ట్ క్లబ్బుల ఆధ్వర్యంలో శ్రీ హర్షిణి మార్టూరు ఒలంపియాడ్ స్కూల్ అండ్ హర్షిని డిగ్రీ కాలేజ్ నందు కార్యక్రమమును నిర్వహించడం జరిగింది. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న జాతీయ ఉద్యమ నాయకులు సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు మొదలగు దేశ నాయకులను గురించి వారి చేసిన త్యాగాలను గురించి విద్యార్థులకు వివరించడం జరిగినది. అనంతరం స్వాతంత్రోద్యమ ఘట్టాలపై విద్యార్థులకు ప్రశ్నోత్తర పోటీలు నిర్వహించి వాటిలో ప్రతిభను కనపరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమములో వైయస్సార్ అంటే ఏం డిగ్రీ కాలేజ రోట్రాక్ట్ సభ్యులు, రోటరీ అధ్యక్షులు కొర్రపాటి కాజారావు, యూత్ సర్వీస్ ఏరియా చైర్మన్ రావి అంకమ్మ చౌదరి, పాస్ట్ ప్రెసిడెంట్ జాష్టి సాంబశివరావు చెన్నుపాటి బసవ రాములు మద్దుమాల కోటేశ్వరరావు విశ్రాంత ప్రిన్సిపాల్ తోటకూర వెంకటనారాయణ, చిలకలూరిపేట రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ శ్రీ హర్షినికాలేజ్ ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు, హర్షిని ఒలింఫియెడ్ హెడ్ మిస్సెస్ కందిమల్ల నిర్మల తదితర ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మిరప తెగుళ్లపై అవగాహన

రైతులతో మాట్లాడుతున్న అధికారి దీప్తి

విశాలాంధ్ర-జెపంగులూరు : మండలంలోని కొండమూరు గ్రామంలో అద్దంకి డివిజన్ హార్టికల్చర్ అధికారి దీప్తి మిరప తోటలలో పురుగులు మరియు తెగుళ్ల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించడం మరియు మిరప తోటలు పరిశీలించడం జరిగింది. రైతులు ఈ ఖరీఫ్‌లో వేసిన మిరప పంటలకు తామర పురుగు అధికంగా ఆశించి పంట నష్టం వాటిల్లింది అని తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తామర పురుగుకి ఏ పురుగు మందులు వాడాలి, ఎంత మోతాదులో వాడాలి అని రైతులకు తెలియడం జరిగింది. తామర పురుగుల తీవ్రత వల్ల మిరప పంట బాగా నష్టపోయిందని ఈ విషయం జిల్లా అధికారుల ద ృష్టికి తీసుకువెళతాను అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు జాగర్లమూడి దినేష్, రైతులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం 12.55లక్షలు

హుండీ ఆదాయం లెక్కిస్తున్న దేవస్థాన సిబ్బంది

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీ మిట్టపాలెం నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.12,55,426 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి తెలిపారు. 26.8.2022 నుండి 25.11.2022 గాను శుక్రవారం దేవాదాయ ధర్మాదాయశాఖ కందుకూరు డివిజన్ పర్యవేక్షణలో హుండీ లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. హుండీ ద్వారా రూ.12,54,526, అన్నదానం హుండీ ద్వారా రూ.30,900 వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ట్రస్ట్ సభ్యులు మంచికంటి మధుసూదన్‌రావు, జిలకర అంజనాదేవి, రాగి రత్తమ్మ, గ్రామస్తులు ముడిమాల నారాయణరెడ్డి, నన్నసాని యయాద్రి, ఆలయ అర్చకులు, గ్రామస్తులు, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సీతారామస్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవం

విశాలాంధ్ర-సింగరాయకొండ : మండలంలోని సోమరాజు పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అప్పాపురం యానాది కాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన శ్రీ సీతారామస్వామి దేవస్థాన శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొండేపి నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ వరికూటి అశోక్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యి దైవకార్యం పట్ల తన భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు స్థానిక పోలేరమ్మ తల్లి చెట్టు దగ్గర నుంచి భక్తిశ్రద్ధలతో మంత్రోచ్చారణల మధ్య శంకును ఊరేగింపుగా నిర్మాణ స్థలానికి తీసుకొచ్చి వరికూటి అశోక్ బాబు మరియు ఆలయ కమిటీ సభ్యుల మధ్య శాస్త్రీయబద్ధంగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అచ్యుత చెంచు సుబ్బారావు భక్తులకు అన్న సంతర్పణ గావించారు. కార్యక్రమంలో సమర సత సేవా ఫౌండేషన్ బాలవికాస కేంద్రం జిల్లా కన్వీనర్ అర్రిబోయిన రాంబాబు కార్యక్రమం నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షించారు. అనంతరం రాంబాబు గిరిజన కాలనీలలో చేపడుతున్న సేవా కార్యక్రమాలకుగాను వరికూటి అశోక్ బాబు ప్రజల సమక్షంలో రాంబాబును దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, పటేల్, లక్ష్మీ నరసింహ స్వామి టెంపుల్ చైర్మన్ పామర్తి మాధవరావు, పుట్ట వెంకట్రావు, రాయి పేర్రాజు, రాయి రమేష్, శ్రీహరిరెడ్డి. చిలం రాము, శివారెడ్డి, పంతగాని నరసింగరావు. పిట్టా బ్రహ్మయ్య, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సహ కన్వీనర్ ఉప్పుగుండూరి వెంకట్, జిల్లా ధర్మ ప్రచారక్ గొల్లపోతు వెంకటేశ్వర్లు, మిడసల బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు స్వల్ప గాయాలు

విశాలాంధ్ర- సంతనూతలపాడు : సంతనూతలపాడు తహసీల్దార్ శ్రీనివాసరావు తన ద్విచక్ర వాహనంపై శుక్రవారం ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ వద్దగల కూరగాయల మార్కెట్‌కు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవటంతో స్వల్ప గాయాలకు గురయ్యారు. వెంటనే స్థానికులు గాయత్రి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చేర్పించారు. సంఘటన విషయం తెలియడంతో వైసీపీ మండల కన్వీనర్ దుంపాచేంచిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు దుంపా యలమందారెడ్డి, పేర్నమిట్ట 42వ డివిజన్ వైసీపీ అధ్యక్షులు నూకతోటి ఈశ్వరరావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, పలువురు రాజకీయ పార్టీ నాయకులు పరామర్శించారు.

30న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ఈ నెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు ఎంపీపీ బుడం గుంట విజయ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో డివిఎస్‌వి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పథకాలు కీలకమైన అంశాలపై చర్చించడం జరుగుతుందని సంబంధిత అన్ని శాఖల అధికారులు తమ నివేదికతో పాటు హాజరు కావాలని ప్రజా ప్రతినిధులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న 'ముత్తుముల'

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని ఏబీఎం పాలెంలో నూతనంగా నిర్మించిన తెలుగు బాప్టిస్ట్ మెయిన్ చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమానికి గిద్దలూరు టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మందిరంలో ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి టీడీపీ ఇంచార్జ్‌కి ప్రభువు ఆశీస్సులు అందజేశారు. అనంతరం పూలమాల శాలువా వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ నాయకులు పందిటి రజనిబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు గోన చెన్నకేశవులు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గుర్రం దానియేలు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు పానుగంటి ఇజ్రాయిల్, పార్లమెంటు ఎస్సీ నాయకులు కత్తి అనోజీరావు, యామా సంజయ్, తలపాటి దివాకర్ దేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

'భూ రక్షా' సర్వేపై డీపీఓ సంతృప్తి

విశాలాంధ్ర-అర్ధవీడు : మండలంలోని దొనకొండ పంచాయితీలో చేసిన జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకం సర్వే పై డిపిఓ జివి నారాయణరెడ్డి సంతృప్తి వ్యక్తం చేసారు. పథకానికి సంబందించిన రికార్డులను ఆయన శుక్రవారం పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజినల్ పంచాయతీ అధికారి జి నాగేశ్వరరావు, ఎంపిడిఓ టి వీరభద్రాచారి, దొనకొండ పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : పట్టణంలోని వీధుల వెంబడి, రోడ్లమీద నివసిస్తూ ఎటువంటి జీవనాధారం లేక చలికి వణుకుతూ ఇబ్బంది పడుతున్న వృద్ధులకు అనాధలకు "నేనున్నాను"అంటూ ముందుకు వచ్చిన ఏల్చూరి శేషగిరిరావు ఎల్ఐసి ఏజెంట్ (మార్కాపురం) వారి కుమారుని ఏల్చూరి శేష ప్రదీప్ పుట్టినరోజు సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ మహోన్నతమైన సేవా కార్యక్రమానికి ఆర్థిక సహాయ సహకారాలు అందించిన శేషగిరిరావు, ప్రదీప్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆ దేవుని చల్లని దీవెనలు ప్రసాదించి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ఇలాగే నిత్యం దాతలు సహాయ సహకారాలు అందించినచో భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెూంగార్డు చెన్నుపల్లి కాశయ్య తెలిపారు. ఎవరైనా దాతలు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలన్నచో 9603580633 నెంబర్‌ని సంప్రదించవలసినదిగా కోరుచున్నారు.

జల జీవన్ మిషన్ కింద ఇంటింటికి కొళాయి

ఇంటింటి కొళాయిని ప్రారంభించిన సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కనిగిరి నియోజకవర్గ టిటిడి పాలక మండల సభ్యులు మరియు కనిగిరి నియోజకవర్గ శాసన సభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు హనుమంతునిపాడు మండల పరిధిలోని దాసరపల్లి పంచాయతీ నందు 40 లక్షల రూపాయల వ్యయంతో జల జీవన్ మిషన్ కింద ఇంటింటికి కొలాయి కార్యక్రమాన్ని దాసం ‘పల్లి సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి చేతుల మీదుగా నూతనంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు పాల్గొనడం జరిగింది.